సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 56 | పేజిలు : 08, వెల రూ. 2 రూ/ | ఆదివారం 17-05-2026

## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడనికి కాదు.. ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు



- నటుడు విజయ్‌తో పోలికపై స్పందించిన పవన్ కల్యాణ్
- ఒంటరిగా పోటీ చేస్తే ఓడించారని పవన్ వ్యాఖ్య
- పవన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన అంబటి రాంబాబు
- పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడానికి కాదన్న అంబటి
- ప్రజలకు ఇప్పుడే నిజం తెలుస్తోందంటూ విమర్శ

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు ఘాటు విమర్శలు చేశారు. పవన్ తన పార్టీని సీఎం అవ్వడానికి పెట్టలేదని, మరొకరిని సీఎం చేయడానికి పెట్టారని తమకు మిగతా 2లో

## ఏపీలో పెట్రోల్,డీజిల్‌పై 31 శాతం
# అధిక వ్యాట్ వసూలు సిగ్గుచేటు

అత్యధిక ఇంధనం ధరలు ఏపీలో ఉండటమా అడ్వాన్స్‌డ్ ఆంధ్రప్రదేశ్ అంటే ?
VAT పేరుతో జనాలను బాదడమా దేశానికి ఏపీ రోల్ మోడల్ ?
సెస్ ల పేరుతో జనాల పర్సులు ఖాళీ చేయడమా విజన్ ఆంధ్రప్రదేశ్ ?
పొదుపు మంత్రం సరే.. మరి వ్యాట్ దోపిడీ సంగతేంటి చంద్రబాబు గారు ?



మోడీ గారి సొంత రాష్ట్రం గుజరాత్ లో లీటర్ డీజిల్ ధర రూ . 93.75 పైసలు. NDA లో పెద్దన్న పాత్ర పోషించే రాష్ట్రం ఏపీలో డీజిల్ ధర రూ 101.24 పైసలు. పక్కరాష్ట్రం తమిళనాడుతో పోల్చినా రూ. 10 రూపాయలు అదనం. కర్ణాటకతో రూ . 7, తెలంగాణ, కేరళతో చూసినా రూ. 4 రూపాయలు ధరాభారం. అధిక వ్యాట్ , అడిషనల్ వ్యాట్ పేరుతో ఏటా ప్రజలపై పడుతున్న అదనపు భారం అక్షరాల 10 వేల కోట్లు. ఆదాయం పెంపు మార్గాలని 2014 నుంచి ,జూ,ాజూ ప్రభుత్వాలు ముక్కుపిండి వసూలు చేయడం దుర్మార్గపు చర్య. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రి మిగతా 2లో

## మూడో బిడ్డ పుడితే రూ.30వేలు,
# నాలుగో బిడ్డ పుడితే రూ.40వేలు

- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ
- శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమం.. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం
నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం
అవార్డుల అభినందనలు.. నరసన్నపేటకు వరాలు
ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి
లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు
ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం"



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే మిగతా 2లో

## కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..



- విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది: మోదీ
- నెదర్లాండ్స్ లోని ది హేగ్ లో ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మోదీ

ఢిల్లీ: భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే మిగతా 2లో

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమి...
# భవితరాలకు ఆరోగ్యానిద్దాం
### ప్రకృతి వ్యవసాయంతో మేలు

- మన ఇంటి నుంచి, మన గ్రామ నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు.
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను, వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలని అన్నారు. చెత్త మీద పన్ను రద్దు చేసి, అదే చెత్తతో సంపద సృష్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడిదన్నారు.



మన ఇంటి నుంచి, మన గ్రామ నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి మిగతా 2లో

## ఆదాయం తగ్గడం సంపద సృష్టా..:
# చంద్రబాబు పాలనపై జగన్ ప్రశ్నల వర్షం
### ఉపాధి శ్రామికుల దుర్మరణం బాధాకరం - వైయస్ జగన్

- కాకినాడ రూరల్ మండలం పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి శ్రామికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ అన్నారు.
- పని ప్రదేశంలో ఉపాధి శ్రామికులు మస్టర్ రోల్ నమోదు చేయించుకునేందుకు నిలబడిన సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం కలచివేసిందన్నారు.



కాకినాడ రూరల్ మండలం పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి శ్రామికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ అన్నారు. పని ప్రదేశంలో మిగతా 2లో

## 'అతడు ఇకపై ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు'


- ఐసిస్ నంబర్ 2 ఉగ్రవాది అల్-మినుకి హతమైనట్లు ప్రకటించిన ట్రంప్!
- ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ ఉగ్రవాద సంస్థలో రెండవ అత్యున్నత కమాండర్ అయిన అబూ-బిలాల్ అల్-మినుకిని అమెరికా, నైజీరియా బలగాలు ఉమ్మడి ఆపరేషన్‌లో విజయవంతంగా మట్టుబెట్టాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.



ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ ఉగ్రవాద సంస్థలో రెండవ అత్యున్నత కమాండర్ అయిన అబూ-బిలాల్ అల్-మినుకిని అమెరికా, నైజీరియా బలగాలు మిగతా 2లో

## మే 19న చైనా వెళ్లనున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చైనాలో పర్యటించనున్నారు.
- మే 19, 20వ తేదీల్లో ఆయన పర్యటన కొనసాగుతుంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు.



మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ . చైనాలో పర్యటించనున్నారు. మే 19, 20వ తేదీల్లో ఆయన పర్యటన కొనసాగుతుంది. చైనా అధ్యక్షుడు మిగతా 2లో

## అపచారాల నిలయంగా తిరుమల
# అనుకూల మీడియా మౌనం



- శ్రీవాణి కాదు అది 'చంద్రవాణి'.
- కలియుగ వైకుంఠంలో రూ. 400 కోట్ల దేవుడి సొమ్ము లూటీ
- శ్రీవాణి టికెట్లను 'చంద్రవాణి'గా మార్చిన కూటమి ప్రభుత్వం.
- ఆన్‌లైన్ మాయాజాలంతో ఒక్క నిమిషంలో 800 టికెట్లు మాయం

కలియుగ వైకుంఠమైన తిరుమలను కూటమి ప్రభుత్వం దళారులు, తమ తాబేదార్లకు వందల కోట్ల దందా కేంద్రంగా మార్చేసిందని వైయస్సార్సీపీ అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మిగతా 2లో

## మిమ్మల్ని 'సాధకులు' అని
# పిలవాలనుకుంటున్నాను.

మంగళగిరిలో జనసేన ఉద్యమి సమావేశం
శస్త్రచికిత్స తర్వాత తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన పవన్
జనసేన క్యాడర్ కు దిశానిర్దేశం

- 2019లో తనను రెండు చోట్లా ఓడించారని వెల్లడి
- పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు.. అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు
- ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు.
- గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు.
- గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు.
- "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది.
- దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది.



ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ మిగతా 2లో

## ప్రధాని పిలుపుతోనే ఆన్‌లైన్‌లో టీడీపీ మహానాడు



- పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగతా 2లో

కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



## 'అతడు ఇకపై ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు'

ఉమ్మడి ఆపరేషన్‌లో విజయవంతంగా మట్టుబెట్టాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. ఈ ప్రత్యేక సైనిక చర్య ఆఫ్రికా ఖండంలో జరిగిందని తెలిపిన ట్రంప్, ఈ ఆపరేషన్ వల్ల ఐసిస్ అంతర్జాతీయ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడిందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు సహకరించినందుకు నైజీరియా ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' లో ట్రంప్ స్పందిస్తూ.. తన ఆదేశాల మేరకే అమెరికా సైన్యం, నైజీరియా సాయుధ బలగాలతో కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించిందని వెల్లడించారు. "ఈ రాత్రి, నా నిర్దేశంలో.. ధైర్యసాహసాలు కలిగిన అమెరికా బలగాలు, నైజీరియా సాయుధ బలగాలతో కలిసి అత్యంత పక్కా ప్రణాళికతో, సంక్లిష్టమైన మిషన్‌ను అద్భుతంగా పూర్తి చేశాయి. ప్రపంచంలోనే అత్యంత చురుకైన ఉగ్రవాదిని యుద్ధభూమి నుండి శాశ్వతంగా తుడిచిపెట్టాయి" అని ట్రంప్ రాసుకొచ్చారు. అబూ-బిలాల్ అల్-మినుకి ఆఫ్రికాలో దాక్కొని సురక్షితంగా ఉండవచ్చని భావించాడని, అయితే అమెరికా నిఘా వర్గాలు అతని ప్రతి కదలికను నిరంతరం పర్యవేక్షించాయని ఆయన తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ సంస్థలో నంబర్ 2 స్థానంలో ఉన్న అబూ-బిలాల్ అల్-మినుకి, తాను ఆఫ్రికాలో దాక్కోవచ్చని అనుకున్నాడు. కానీ అతని కార్యకలాపాలపై మాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించే బలమైన నిఘా వర్గాలు మాకున్నాయనే విషయం అతనికి తెలియదు" అని ట్రంప్ అన్నారు. ఈ ఐసిస్ అగ్రనేత ఇకపై "ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడని" లేదా అమెరికన్లపై దాడులకు ప్రణాళికలు వేయలేడని ట్రంప్ స్పష్టం చేశారు. "అతడి నిర్మూలనతో ఐసిస్ అంతర్జాతీయ కార్యకలాపాలు చాలా వరకు కుంచించుకుపోయాయి. ఈ ఆపరేషన్‌లో భాగస్వామ్యమైనందుకు నైజీరియా ప్రభుత్వానికి ధన్యవాదాలు. గాడ్ బ్లెస్ అమెరికా!" అని అమెరికా అధ్యక్షుడు జోడించారు. ఆఫ్రికాలోని సాహెల్ ప్రాంతంలో ఐసిస్ ఉగ్రవాద కార్యకలాపాలకు నాయకత్వం వహించిన సీనియర్ నేత 'అబూ బకర్ ఇబ్న్ ముహమ్మద్ ఇబ్న్ అలీ అల్-మైనుకి'కి ఉన్న మరొక పేరే ఈ 'అబూ-బిలాల్ అల్-మినుకి' అని భావిస్తున్నారు. అమెరికా రికార్డుల ప్రకారం.. ఇతడు ఐసిస్ యొక్క 'జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ప్రావిన్సెస్'తో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఇతనికి అబూ బిలాల్ అల్-మినుకి, అబూబకర్ మైనోక్, అబోర్ మైనోక్ వంటి పలు మారుపేర్లు ఉన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ ఇతడిని 2023లోనే అంతర్జాతీయ సీనియర్ ఐసిస్ లీడర్‌గా అధికారికంగా ప్రకటించింది. సాహెల్ ప్రాంతంలో జరిగిన అనేక ఉగ్రవాద దాడులలో ఇతడు కీలక పాత్ర పోషించాడని, ఐసిస్ అంతర్జాతీయ నిర్మాణంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడని నివేదికలు పేర్కొన్నాయి.

## మే 19న చైనా వెళ్లనున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టూర్ చేసిన కొన్ని రోజుల తేడాలోనే రష్యా అధ్యక్షుడు చైనా ట్రిప్‌కు వెళ్తున్నారు. పుతిన్, జిన్‌పింగ్ ఇద్దరూ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై స్పందించనున్నారు. సంయుక్త డిక్లరేషన్‌పై ఇద్దరు నేతలు సంతకం చేయనున్నారు. ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో ఇద్దరు నేతల భేటీ కీలకం కానున్నది. రష్యా అధ్యక్షుడికి చైనా ఆహ్వానం పంపినట్లు క్రెమ్లిన్ తన ప్రకటనలో తెలిపింది. పుతిన్ తన పర్యటనలో చైనా ప్రధాని లీ క్వియాంగ్‌ను కూడా కలుసుకుంటారు. వాణిజ్యం, ఆర్థిక సంబంధాలపై చర్చించుకోనున్నారు. గత ఆగస్టులోనే పుతిన్ చైనాలో విజిట్ చేశారు. బీజింగ్‌లో షాంఘై కార్పొరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ జరిగినప్పుడు పుతిన్ వెళ్లారు. ఈ ఏడాది పుతిన్ రెండు సార్లు చైనాలో పర్యటించనున్నారు. నవంబర్‌లో షెన్‌జెన్‌లో జరిగే ఏషియా పసిఫిక్ ఎకనామిక్ కార్పొరేషన్ మీటింగ్‌కు హాజరుకానున్నారు.

## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడనికి కాదు..
## ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

ఎప్పటినుంచో తెలుసంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళ నటుడు విజయ్ ఇటీవల రాజకీయాల్లోకి వచ్చి ఒంటరిగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో, పవన్ కూడా అలాగే గెలవాల్సిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై జనసేనాని స్పందించారు. విజయ్‌తో తనకు పోలిక లేదని, గతంలో తాను ఒంటరిగా రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అందుకే పొత్తులతో వెళ్లాల్సి వచ్చిందని ఆయన వివరించారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలనే అంబటి రాంబాబు ఆయుధంగా చేసుకున్నారు. "మీరు సీఎం కావాలని కాదు, ఎవరో సీఎం కావాలని పార్టీ పెట్టారని మాకు ఎప్పుడో తెలుసు. కానీ ఆ విషయం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది" అని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ స్వయంగా తన ఓటమిని, పొత్తుల అవసరాన్ని అంగీకరించడంతో, ఆయన రాజకీయ లక్ష్యంపై అంబటి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది.

## కోట్లాది మంది భారతీయుల నమ్మకం
## నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..

భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు. భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు.

## ప్రధాని పిలుపుతోనే ఆన్‌లైన్‌లో టీడీపీ మహానాడు

పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్స్ వారీగా స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియచేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. నిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఈ కమిటీకి రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయిస్తే సహించమన్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## ఆపచారాల నిలయంగా తిరుమల అనుకూల మీడియా మౌనం

శనివారం తిరుపతిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన టీటీడీ ఆన్‌లైన్ ఐటీ వ్యవస్థ లోపాలను, విఐపీ బ్రేక్ దర్శనాల వెనుక జరుగుతున్న వందల కోట్ల బ్లాక్ మార్కెట్ దందాను ఆధారాలతో సహా ఎండగట్టారు. వైయస్ జగన్ హయాంలో హైందవ ధర్మ రక్షణ కోసం తెచ్చిన 'శ్రీవాణి ట్రస్ట్' ఆన్‌లైన్ టికెట్లను కేవలం ఒక్క నిమిషంలోనే మాయం చేస్తూ కూటమి నేతలు రూ. 48 కోట్ల పచ్చిదోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. తిరుమలలో ఉచిత దర్శనం దగ్గర నుండి వీఐపీ బ్రేక్ టికెట్ల వరకు బ్లాక్ మార్కెట్‌గా మార్చి, ఇప్పటివరకు రూ. 400 కోట్లకు పైగా స్వామివారి సొమ్మును లూటీ చేశారని.. దీనిపై డీఆర్ డీ ఓ, సెర్ట్ -ఇన్ సంస్థల పర్యవేక్షణలో సీబీఐ ఆధ్వర్యంలో విచారణ జరిపించే దమ్ము చంద్రబాబుకు ఉందా అని భూమన సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే..జనవరి 9, 2026 నుంచి రోజువారీ కోటా కింద ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న 800 శ్రీవాణి టికెట్ల కేటాయింపులో భారీ ఐటీ కుంభకోణం సాగుతోంది. ఉదయం సరిగ్గా 9:00 గంటలకు విడుదలయ్యే ఈ 800 టికెట్లు 9:01 నిమిషాలకల్లా 'పూర్తయ్యాయి' అని వెబ్‌సైట్‌లో చూపిస్తోంది. ఈ దోపిడీని నిరూపించడానికి టీటీడీ మాజీ చైర్మన్‌గా నేనే స్వయంగా ఉదయం 8:57 గంటలకు లాగిన్ అయ్యాను. నా వివరాలన్నీ ఇచ్చి 9:00 గంటలకు పేమెంట్ గేట్‌వే క్లిక్ చేయగా 'పేమెంట్ ఎర్రర్' అని వచ్చింది. 9:01 గంటలకు చూస్తే మొత్తం 800 టికెట్లు అయిపోయినట్లు చూపించింది. సామాన్య భక్తులకు దక్కకుండా 'ఆటో ఫిల్లింగ్' టెక్నిక్ ఉపయోగించి దళారులు, ప్రైవేట్ ట్రావెల్ ఏజెంట్లు టీటీడీ పెద్దల ఆశీస్సులతో ఈ టికెట్లను కొల్లగొడుతున్నారు.

# మూడో బిడ్డ పుడితే రూ.30వేలు, నాలుగో బిడ్డ పుడితే రూ.40వేలు

రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

నా జీవితాశయం ఇదే.. నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం

ప్రజల అభిమానాన్ని చూస్తుంటే ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్-2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజాప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునికీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు.

లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు

తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ-సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

గొడ్డలి పార్టీతో జాగ్రత్త.. విధ్వంసం, అభివృద్ధికి తేడా ఇదే

గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్ల ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై మరోసారి సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జనాభా తగ్గుదల సమస్యగా మారిందని అన్నారు. జనాభా తగ్గితే ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని చెప్పారు. జనాభా పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని అన్నారు. పిల్లలు భారం కాదని వాళ్లే సంపద అని వ్యాఖ్యానించారు. మూడో బిడ్డ పుట్టిన వెంటనే ఆ దంపతులకు రూ.30వేలు ఇస్తామని ప్రకటించారు. నాలుగో బిడ్డ పుట్టిన వెంటనే రూ.40వేలు ఇస్తామని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని ఈరోజు స్వచ్ఛాంధ్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నామని, ఒకటో తారీఖు వచ్చిందంటే ఎక్కడ ఉన్నా ఆ రోజు మీ దగ్గరకు వచ్చి నేరుగా పింఛన్లు ఇవ్వడంలో ఎంతో ఆనందం ఉంటుందని చెప్పారు. అధికార యంత్రాంగం, టీడీపీ కుటుంబం తనకు ఉన్న రెండు టీమ్స్ అని అన్నారు. తనకు మంచి పేరు వచ్చినా, చెడు పేరు వచ్చినా అధికార యంత్రాంగం వల్లే వస్తుందన్నారు. అనునిత్యం కంటికి రెప్పల్లా కాపాడుకునే టీడీపీ కుటుంబాన్ని, జీవితంలో మర్చిపోలేనని అన్నారు. గ్యారెంటీ లేకుండా పోయింది. ఎన్నికలు ముగిసిన పది రోజులకే లీటరుకు మూడు రూపాయలకు పైగా పెంచడం ప్రజలను వంచించడమే అవుతుంది. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకం. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎలా చెప్పుకుంటారు?. పెంచిన ధరలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప... ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు అన్నది తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి.

# మిమ్మల్ని 'సాధకులు' అని పిలవాలనుకుంటున్నాను.

సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు.

ఆరోగ్య సమస్యలపై తొలిసారిగా స్పందన

గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

నన్ను ఇతరులతో పోల్చవద్దు

తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "పొరుగు రాష్ట్ర నేతలా మీరు కూడా చేసి ఉండాల్సింది అని చాలామంది సందేశాలు పంపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు వేరు. అదే పని 2019లో చేస్తే రెండుచోట్లా ఓడించారు కదా అండగా ఉంటానన్న నాయకులంతా ఆ రోజు పారిపోయారు. నాకు పదవి ముఖ్యం అనుకుంటే 2008లోనే ఎంపీగా పోటీ చేసేవాడిని, 2014లోనూ అవకాశం వచ్చింది. కానీ నాకు పార్టీని నిర్మించడం ముఖ్యం" అని స్పష్టం చేశారు.

భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత

రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ నాలుగు కీలక అంశాలను ప్రస్తావించారు.

1.పార్టీ నిర్మాణం: "ఒక పుష్కర కాలం (12 సంవత్సరాలు) తర్వాత పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాల్సిన సమయం వచ్చింది. ఇన్నాళ్లూ సిద్ధాంతాన్ని నమ్మి, ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడిన మీరే ఈ పార్టీకి పునాది. మిమ్మల్ని కేంద్రంగా చేసుకునే కొత్త నిర్మాణం ఉంటుంది" అని తెలిపారు.

2.భావజాలం: జనసేన ఏడు సిద్ధాంతాలను కార్యకర్తలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

3.పొత్తు ధర్మం, భవిష్యత్ మార్గం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్ర ఎలా ఉండబోతోందో వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా స్పష్టత ఇచ్చారు.

4.జాతీయ స్థాయిలో పాత్ర: ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా జనసేన ఎలా ముందుకు సాగాలో, ఇతర రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను ఎలా సమన్వయం చేసుకోవాలో వివరిస్తానని చెప్పారు.

క్షేత్రస్థాయి నాయకులే పార్టీ బలం

పార్టీ బలం తాను కాదని, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలేనని పవన్ పునరుద్ఘాటించారు. "ఒకప్పుడు 150 మందితో మొదలైన పార్టీలో ఇప్పుడు 21.5 లక్షల మంది జనసైనికులు, వీరమహిళలు ఉన్నారు. మిమ్మల్ని 'సాధకులు' అని పిలవాలనుకుంటున్నాను. లక్ష్యాన్ని సాధించేవారే సాధకులు. 'మా ఊరికి నేనే పవన్ కల్యాణ్' అని వైజాగ్‌లో ఒక జనసైనికుడు చెప్పినప్పుడు, నేను కోరుకున్న పార్టీ నిర్మాణం ఇదే అనిపించింది," అని అన్నారు. విజయనగరంలో 'మంగళవారం హుసేన్', నక్సలిజం వీడి ఉపసర్పంచ్ అయిన అరకు యువకుడు బాబూరావు వంటి ఎందరో స్ఫూర్తిదాయక కార్యకర్తలే జనసేన నిజమైన బలమని కొనియాడారు. "ఈ విజయం ఉమ్మడి పోరాటం వల్లే సాధ్యమైంది. ఈ గెలుపులో నాకు ఎంత వాటా ఉందో, మీ అందరికీ అంతే సమానమైన వాటా ఉంది.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమి...భవితరాలకు ఆరోగ్యానిద్దాం

ఎస్.సవిత పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను, వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలని అన్నారు. చెత్త మీద పన్ను రద్దు చేసి, అదే చెత్తతో సంపద సృష్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడిదన్నారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కోసం సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి, గ్రామాల్లో పరిశుభ్రతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఇళ్లోకి, గ్రామాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రాకుండా చేయడంలో మహిళలే కీలకమన్నారు. మన భావితరాలకు ఆస్తులతో ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత పాలకులు చెత్త మీద పన్ను వేసి, ప్రజలపై ఆర్థిక భారంగా మోపారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసి, అదే చెత్త ద్వారా సంపద సృష్టిస్తున్నారన్నారు. చెత్తతో వర్మీ కంపోస్ట్, ఇతర సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు సేకరించి, ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారన్నారని మంత్రి సవిత తెలిపారు. ప్రజలంతా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి షాపు వద్ద మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలిపే ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక రోగాలతో మనుషుల ప్రాణాల పోవడంలో ప్లాస్టిక్ తో పాటు అతిగా ఎరువుల వాడకం కూడా కారణమని మంత్రి సవిత తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ మంచి డిమాండ్ ఉందని, తద్వారా అధిక లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. జంక్ ఫుడ్ కారణంగా క్యాన్సర్ వ్యాపిస్తోందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇటువంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని మంత్రి సవిత సూచించారు. చెత్తను ఎక్కడి పడితే అక్కడ పడేయకుండా, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. స్వచ్ఛ పెనుకొండ బాధ్యత పట్టణ ప్రజలందరిదీనని స్పష్టంచేశారు. అనంతరం గాంధీ సర్కిల్ లో మానవ హారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ నిర్వహించారు. నా దేశం - నా బాధ్యత కింద ప్రతి ఒక్కరూ పొదుపు మంత్రం పాటించాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు మాటలను మంత్రి తూచ తప్పకుండా పాటించారు.

# ఆదాయం తగ్గడం సంపద సృష్టా..: చంద్రబాబు పాలనపై జగన్ ప్రశ్నల వర్షం

ఉపాధి శ్రామికులు మస్టర్ రోల్ నమోదు చేయించుకునేందుకు నిలబడిన సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం కలచివేసిందన్నారు .రాష్ట్ర ఆదాయం తగ్గడం సంపద సృష్టా అని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని ఆరోపించారు. రెండేళ్లుగా అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. 2025-26లో జీఎస్డీపీ వృద్ధి రేటు 10.75 శాతం అని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, కానీ ప్రభుత్వ ఆదాయం మాత్రం ఎందుకు 3.22కు తగ్గిందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రం అభివృద్ధి చెందితే రెవెన్యూ పెరగాలి కదా అని నిలదీశారు. 2023-24లో పన్నుల ద్వారా రాష్ట్ర ఆదాయం రూ. 85 వేల 922.23 కోట్లు వచ్చిందని తెలిపారు. రెండేళ్లల్లో 8 శాతం పెరిగినా 2025-26 నాటికి రూ. లక్షా 219.69 కోట్లకు చేరాలని చెప్పారు. కానీ వాస్తవంగా వచ్చింది రూ.86 వేల 552.68 కోట్లు మాత్రమేనని తెలిపారు. అంచనా కంటే రూ. 13 వేల 667 కోట్ల ఆదాయం తగ్గడం సంపద సృష్టా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక స్థితి ఆందోళనకరంగా ఉందని కాగ్ రిపోర్టులే చెబుతున్నాయని జగన్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి శ్రామికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ అన్నారు. పని ప్రదేశంలో ఉపాధి శ్రామికులు రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం కలచివేసిందన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళా శ్రామికుల కుటుంబాలకు వైయస్ జగన్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను కోరారు. ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ విపరీతంగా మద్యం సేవించి వాహనం నడిపినట్టు వస్తున్న సమాచారం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో రాత్రింబవళ్ళు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి దారుణాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అక్రమ మద్యం విక్రయాలు, నిర్లక్ష్య పర్యవేక్షణ వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు.. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, అధిక ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో పనులు నిర్వహించే సమయంలో తగిన హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మృతి చెందిన కుటుంబాలకు తక్షణ ఆర్థికసాయం అందించి, బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వైయస్ జగన్ డిమాండ్ చేశారు.

# ఏపీలో పెట్రోల్,డీజిల్‌పై 31 శాతం అధిక వ్యాట్ వసూలు సిగ్గుచేటు

చంద్రబాబు గారిని డిమాండ్ చేస్తున్నాం. పెట్రోల్,డీజిల్ పై వసూలు చేస్తున్న 31 శాతం అధిక వ్యాట్ ను తగ్గించాలి. కర్ణాటకలో సేల్స్ టాక్స్ గరిష్టంగా 29 శాతం మాత్రమే. తమిళనాడులో వ్యాట్ కేవలం 13 శాతమే. తెలంగాణలో 35 శాతం వ్యాట్ విధింపు ఉన్నా.. అదనపు వ్యాట్ 4 రూపాయల చార్జీల భారం లేదు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఇంధనంపై వాట్ ను భారీగా తగ్గిస్తూ, అదనంగా వసూలు చేస్తున్న 4 రూపాయలను, రోడ్డు సెస్ పేరుతో దోపిడీ చేస్తున్న రూ. 1 ని , మొత్తంగా లీటర్ ధరపై కనీసం 5 రూపాయలు అయినా ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పడే భారాన్ని మోదీ గారి మెడలు వంచి తీసుకు రండి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ ,డీజిల్ పై వసూలు చేస్తున్న 31 శాతం అధిక వ్యాట్ ను వెంటనే తగ్గించాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అత్యధిక ఇంధనం ధరలు ఏపీలో ఉన్నాయని ట్విటర్ వేదికలో ఆరోపించారు. ఏపీ రోల్ మోడల్ అంటే వ్యాట్ పేరుతో జనాలను బాదడమా అంటూ ప్రశ్నించారు. లీటర్ ధర మీద అదనంగా రూ.4 గుంజడంపై నియంత్రణ ఎందుకు లేదని అన్నారు. పొదుపు చర్యలు ప్రజలకేనా.. పన్నులు తగ్గించడంలో ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. అభివృద్ధిలో చివరిస్థానం, ఇంధనం ధరల్లో మొదటి స్థానం ఉన్నందుకు సిగ్గుపడాలని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 97.77 పైసలుండగా, అమరావతిలో లీటర్ పెట్రోల్ ధర 113. 62 పైసలుందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో లీటర్ డీజిల్ ధర రూ . 93.75 పైసలుండగా ఎన్డీయేలో పెద్దన్న పాత్ర పోషించే రాష్ట్రం ఏపీలో డీజిల్ ధర రూ 101.24 పైసలుండడం దారుణమని అన్నారు. పక్కరాష్ట్రం తమిళనాడుతో పోల్చినా రూ. 10 రూపాయలు అదనంగా ఏపీలో చమురు ధరలున్నాయని విమర్శించారు. కర్ణాటకతో రూ . 7, తెలంగాణ, కేరళతో చూసినా రూ. 4 రూపాయలు ధరాభారం అధికంగా ఉందని ఆరోపించారు. అధిక వ్యాట్ , అడిషనల్ వ్యాట్ పేరుతో ఏటా ప్రజలపై పడుతున్న 10 వేల కోట్లు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. ఆదాయం పెంపు మార్గాలని 2014 నుంచి టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు ముక్కుపిండి వసూలు చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పడే భారాన్ని మోదీ మెడలు వంచి తీసుకు రావాలని సీఎం చంద్రబాబుకు సూచించారు. జరుగుతున్న ఆధునికీకరణ పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పాత బస్తీ ప్రాంతంలో జరుగుతున్న రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులను పరిశీలించేందుకు మలక్‌పేట్, ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను ఈరోజు సందర్శించాను.. పాత బస్తీ ప్రజలకు కూడా దేశంలోని ఇతర నగరాల స్థాయిలో రైల్వే సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం అని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా లిఫ్టులు, ఎస్కలేటర్లు, విస్తృతమైన ప్లాట్‌ఫారాలు, ప్లాట్‌ఫారం షెల్టర్లు, మెరుగైన పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, ఆధునిక వెయిటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను విద్యార్థిగా ఉన్న రోజుల నుంచే ఉప్పుగూడ, మలక్‌పేట్ స్టేషన్లను ప్రజలు ఎంతగా ఉపయోగించుకునేవారో చూశాను.. ఇప్పుడు మళ్లీ వాటికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.. పాత బస్తీ ప్రజలు కూడా గర్వపడేలా ఈ స్టేషన్లను అందంగా, ఆధునికంగా తీర్చిదిద్దుతున్నాం అని ఆయన చెప్పారు.

## ఆర్ట్ కాఫ్ సాంస్కృతిక దినోత్సవం






**ములుగు ప్రతినిధి మే 16 (సీమ కిరణం న్యూస్) :**శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ విద్యా వారోత్సవాలలో భాగంగా ఆర్ట్ క్రాఫ్ట్ సాంస్కృతిక దినోత్సవంసందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వాజేడు నందు యందు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించిన ఎంపీడీవో శ్రీకాంత్ , ఎంఈఓ తేజవత్ వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు,ఈ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మహేశ్వరి అనే విద్యార్థినికి నోటుబుక్కు పెన్ను ను బహుమతిగా స్థానిక ఎంపీడీవో ఎంఈఓ చేతుల మీదుగా బహుమతిని అందజేయడం జరిగింది.

## నూతనంగా ఎన్నుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా కందుల రామ్ కిషోర్



**ములుగు ప్రతినిధి మే 16 (సీమ కిరణం న్యూస్) :**ములుగు జిల్లా వాజేడు మండలంలోగత 12 సంవత్సరాల కాలం నుండి భారతీయ జనతా పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికై సేవలందిస్తూ, ఎన్నో కార్యక్రమాలను విజయవంతం చేస్తూ, ఎంతోమంది కార్యకర్తలను పార్టీలో చేర్పిస్తూ, ఇద్దరు సర్పంచులు,ఒకరు సొసైటీ డైరెక్టర్ గా గెలిపించిన ఘనత , పార్టీ డెవలప్మెంట్ చేసిన కందుల రామ్ కిషోర్ జిల్లా ఉపాధ్యక్షులు గా ఎన్నికైన సందర్భంగా బీజేపీ మండల కమిటీ శుభాకాంక్షలు తెలుపుతుంది.

## సేవా కార్యక్రమాలతో జె.సి. అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకలు





**యాడికి మే 16 (సీమ కిరణం న్యూస్) :** యాడికి తాడిపత్రి శాసనసభ్యులు జేసి అస్మిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా యాడికిలోని కమలపాడు రోడ్డులో ఉన్న ఆగాపే వృద్ధాశ్రమంలో జె.సి.అభిమానులు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జె.సి. అభిమానులు సెల్ పాయింట్ చాంద్ బాషా, ఫైబర్ చందు, ఫిరోజ్ బాషా, పూలతోట రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాలు వడ్డించి, వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన మరింత అభివృద్ధి సాధించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జె.సి. అభిమాని విశ్వనాథ్, సుభహాన్, దాసరి రామచంద్ర, మొహమ్మద్ రఫీ, చికెన్ షాప్ వలి, పల్లా శివతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధుల దీవెనల మధ్య అస్మిత్ రెడ్డి బర్త్‌డే వేడుకలు





**(సీమ కిరణం న్యూస్) :** యాడికి మండలంలోని పలు వృద్ధాశ్రమాల్లో ఎమ్మెల్యే జే.సి . అస్మిత్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ నాయకుడు గండికోట లక్ష్మణ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేసి, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.ముందుగా ఎమ్మెల్యే జన్మదిన కేక్‌ను కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అనంతరం ప్రేమాభిమానాలతో వారితో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని,ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని వృద్ధులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గండికోట లక్ష్మణ్ మాట్లాడుతూ, సమాజంలో వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వృద్ధాశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యత

### డాక్టర్ రాహుల్



**ప్యాపిలి మే 16 (సీమ కిరణం న్యూస్) :** పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యతని డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్. రంగారెడ్డి, డాక్టర్. రాహుల్ ఆధ్యర్యంలో శనివారం జాతీయ యాంటి డెంగ్యూదినోత్సవం సందర్భంగా డాక్టర్. రాహుల్,రాఘువేంద్ర గౌడు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి,పర్యవేక్షకులు మనోహర్ రెడ్డి పట్టణం లో ర్యాలీ నిర్వహిస్తూ మూడు పద్ధతులు పాటించండి - డెంగ్యూ ని నివారించండి మీ ఇంటిల్లోని, పరిసరాల లోని నీటి తొట్టిలను పరిశీలించండి నీటి తొట్టిలను శుభ్రపరచండి, నీటి తొట్టిలపైన మూతలు కప్పండి, ఇంటి చుట్టూ నీటి నిలువలు లేకుండా చేయండి- మీ కుటుంబాన్ని డెంగ్యూ నుంచి కాపాడండి పరసరాలను శుభ్రంగా ఉంచికోండి దోమల వృద్ధిని అరకట్టండి. దోమతేరలు కట్టుకోండి దోమ కాటు నుంచి రక్షణ పొందండి అనే స్లొగన్స్ తో ప్రజలకు అవగాహనా కల్పించరు. డెంగ్యూ జ్వరం ఏడిస్ దోమ పగటి పూట కుట్టడం ద్వారా వస్తుంది. ఇది మన ఇంటి లోని, పరిసరాల లో ని నీటి నిలువలలో గుడ్లు పెట్టి పెరుగుతాయి. ప్రతి శుక్రవారం డ్రై డే జరిపి నీటి తొట్టిలను శుభ్రం చేయడం వలన నీటి లోని లార్వాలు అంతము కావడం వలన దోమల పెరుగుదలను అరికట్టి వచ్చును.దోమలు కాటు వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, పైలరియా, చికెన్ గున్య, మెదడు వాపు, జికా వంటి వ్యాదులను నిర్మూలించవచ్చును. డెంగ్యూ లక్షణాలలో ముఖ్యం ఒక్కసారిగా వచ్చే అధిక జ్వరం,తలనొప్పి, కంటి వెనుక భాగం లో నొప్పి, కండరాల నొప్పులు, చర్మం పై గుండ్రటి ఎర్రటి మచ్చలు ఉంటే వెంటనే ఆసుపత్రి కి వెళ్ళాలి అని అవగాహనా కలిపిపించడం జరిగింది.కార్యక్రమం లో పర్యవేక్షకులు సరోజ, ప్రసన్న, శ్రీనివాసులు, రోజా, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత





### ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి

### డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరావు యాదవ్

**ప్యాపిలి మే 16 ( సీమ కిరణం న్యూస్) :** ప్రపంచ వ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి పౌరుడు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి , డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరావు యాదవ్ అన్నారు. పట్టణంలోని ఆర్ & బి వసతి గృహంలో శనివారం ఎమ్మెల్యే కోట్ల టిడిపి పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు, ఇంధన పొదుపు చర్యలు మరియు ప్రజా ధన సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ డోన్ నియోజకవర్గంలో ఈ నెల 19వ తేదీ మంగళవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించదలచిన మినీ మహానాడు కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగ నియంత్రణ, ఇంధన సంరక్షణ చర్యలు మరియు పరిపాలనా పరమైన సమర్థతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా ధనం ఆదా చేయడం, ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా నెల్లూరు జిల్లాలో నిర్వహించాల్సిన మహానాడు కార్యక్రమాన్ని రద్దు చేసి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ హైబ్రిడ్ విధానంలో క్లస్టర్ వారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. క్లస్టర్ స్థాయిలో నిర్వహించే సమావేశాలలో కార్యకర్తలు చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు పార్టీ బలోపేతమే తమ లక్ష్యమని తెలిపారు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజా ప్రయోజనాల దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు

## ఘనంగా 'బడి పిలుస్తోంది



### స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు

**ప్యాపిలి మే 16 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మరియు 'బడి పిలుస్తోంది' కార్యక్రమాలు శనివారం అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస రావు,మండల విద్యాశాఖాధికారులు వెంకటేశ్వర నాయక్, మహేశ్వర రెడ్డి , డి వై ఎంపిడిఓ ప్రభాకర్ మరియు శివ కుమార్ గౌడ్ స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలికార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, బడి ఈడు ఉన్న పిల్లలెవరూ కూడా చదువుకు దూరం కాకూడదని, అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడడమే 'బడి పిలుస్తోంది' ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాలపై అవగాహన:ప్రభుత్వ బడులలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం గురించి ఈ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కూలంకషంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యను, వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## బంధువులు వెనుకడుగేసిన చోట మానవత్వంతో ముందుకొచ్చిన ఫౌండేషన్







**యాడికి మే 16 (సీమ కిరణం న్యూస్) :**యాడికి సమాజంలో బంధాలు, అనుబంధాలు క్రమంగా కనుమరుగవుతున్న ఈ రోజుల్లో, తోటి మనిషి కష్టంలో అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకుంది యాడికి కి చెందిన 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ మూడు రోజుల క్రితం మరణించి, గుర్తుపట్టలేని స్థితికి చేరిన ఓ వృద్ధుడి మృతదేహానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి ఫౌండేషన్ సభ్యులు మరోసారి తమ సేవాభావాన్ని నిరూపించారు.యాడికి ప్రాంతానికి చెందిన బండికారి మద్దిలేటి (80) అనే వృద్ధుడు మూడు రోజుల క్రితం మృతి చెందారు. తీవ్ర ఎండల కారణంగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, కనీసం గుర్తుపట్టలేని దయనీయ స్థితికి చేరుకుంది. మృతుడికి ఒక కుమారుడు ఉన్నప్పటికీ, ఒంటరిగా ఆ పరిస్థితిలో అంత్యక్రియలు నిర్వహించడం అతనికి సాధ్యం కాలేదు. మృతదేహం పరిస్థితిని చూసి బంధువులు, గ్రామస్థులు సైతం ముందుకు రాకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర వేదనకు గురైంది.ఈ విషయం తెలుసుకున్న స్థానికులు యాడికి 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, చందగాని ధ్రువనారాయణ, సాకరే శంకరప్ప, టి.లక్ష్మీకాంతమ్మ, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.కుళ్లిపోయిన మృతదేహాన్ని తాకడానికి కూడా ఇతరులు వెనుకాడుతున్న తరుణంలో, ఫౌండేషన్ సభ్యులు ఏమాత్రం భయపడకుండా మృతదేహాన్ని శుభ్రపరిచి పాడె కట్టి, మృతుడి కుమారుడికి ధైర్యం చెబుతూ హిందూ సంప్రదాయాల ప్రకారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.కడసారి చూపుకు కూడా నోచుకోని ఆ వృద్ధుడి దేహానికి గౌరవప్రదమైన వీడ్కోలు పలకడం మా బాధ్యతగా భావించాం" అని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో, బంధువులున్నా అనాథలా మారిన ఒక వృద్ధుడికి అంతిమ సంస్కారాలు నిర్వహించిన 'మే ఐ హెల్ప్ యూ' ఫౌండేషన్ సేవలను యాడికి ప్రజలు, పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. కన్నవారే కాదనుకున్నా... మేమున్నాం అంటూ ముందుకు వచ్చిన ఈ యువకులు సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉందని నిరూపించారని ప్రజలు కొనియాడుతున్నారు.

## వాహనదారులకు గుడ్‌న్యూస్ ఇక టోల్ గేట్ వద్ద ఆగే పనిలేదు రయ్ అంటూ దూసుకెళ్లడమే!




వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై టోల్ గేట్‌ల వద్ద ఆగే పనిలేకుండా వాహనం నెంబర్ ఆధారంగానే టోల్‌ను కట్‌చేసుకునే కొత్త విధానాన్ని తీసుకురాబోతుంది. 2027 నాటికి దేశవ్యాప్తంగా అన్ని ఫిజికల్ టోల్ ప్లాజాలను తొలగించి, నూతన శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ టోలింగ్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2026 చివరి నాటికి దేశంలోని ఫిజికల్ టోల్ ప్లాజాలన్నింటినీ తొలగించనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఇకపై వాహనదారులు టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా, గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నా ఆటోమేటిక్‌గా టోల్ వసూలు చేసే సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నూతన వ్యవస్థ మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో శాటిలైట్ ఆధారిత టోలింగ్ విధానంపై ఆధారపడి ఉంటుంది. హైవేలపై ఏర్పాటు చేసే హై-స్పీడ్ కెమెరాలు, సెన్సార్లు వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించి, వాహనం ప్రయాణించిన కిలోమీటర్ల ఆధారంగానే టోల్ మొత్తాన్ని ఫాస్టాగ్ లేదా లింక్డ్ బ్యాంక్ ఖాతాల నుంచి కట్ చేస్తాయి. దీనివల్ల ప్రయాణ సమయం ఆదా అవ్వడమే కాకుండా, ఇంధన ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.ప్రస్తుతం ఉన్న టోల్ ప్లాజాల వద్ద నిర్ణీత దూరం ప్రయాణించకపోయినా పూర్తి టోల్ చెల్లించాల్సి వస్తోంది. కానీ కొత్త విధానంలో పే యాజ్ యూ గో మోడల్ అమలు కానుంది. అంటే మీరు ప్రయాణించిన ప్రతి కిలోమీటరుకు మాత్రమే ఛార్జీ పడుతుంది. దీనివల్ల గతంలో రూ. 150 చెల్లించిన చోట, ప్రయాణ దూరాన్ని బట్టి కేవలం రూ. 15 మాత్రమే పడే అవకాశం ఉందని గడ్కరీ పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 85 ప్రాంతాల్లో ఈ ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి.ఈ టెక్నాలజీ వల్ల ఏటా దాదాపు రూ. 1,500 కోట్ల విలువైన ఇంధనం ఆదా అవుతుందని, అదే సమయంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ. 6,000 కోట్ల వరకు పెరుగుతుందని అంచనా. అంతేకాకుండా, టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ సమస్యలు పూర్తిగా తొలగిపోయి, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరుగుతుంది. 2027 నాటికి భారతీయ రహదారులు అమెరికా, యూరప్ ప్రమాణాలకు ధీటుగా మారుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## పీఎం కిసాన్ నుంచి మీ పేరును తొలగించారా? వాయిదా రాలేదా? ఇలా చెక్ చేసుకోండి!




ప్రస్తుతం లక్షలాది మంది రైతులు పీఎం కిసాన్ యోజన 23వ విడత కోసం ఎదురుచూస్తున్నారు. అంతకుముందు పీఎం కిసాన్ యోజన 22వ విడతను మార్చి 13న విడుదల చేశారు. ఈ విడత ద్వారా, దేశవ్యాప్తంగా 93.2 మిలియన్లకు పైగా రైతుల ఖాతాలకు.. పీఎం కిసాన్ యోజన 23వ విడత కోసం ఎదురుచూస్తున్న చాలా మంది రైతులు, తమ పేర్లను జాబితా నుండి తొలగించారేమోనని ఆందోళన చెందుతున్నారు. మీరు కూడా పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులై ఉండి, మీ పేరు తొలగించారేమోనని ఆందోళన చెందుతుంటే, మీరు తాజా స్టేటస్‌ను తనిఖీ చేసుకోవచ్చు. తాజా స్థితిని తనిఖీ చేయడం ద్వారా మీరు ఇప్పటివరకు అందుకున్న వాయిదాల గురించిన సమాచారం మీకు లభిస్తుంది. మీ చెల్లింపు, వఖ్జ స్థితి గురించిన సమాచారం కూడా మీకు లభిస్తుంది.

### స్టేటస్‌ను తనిఖీ చేయండి:

ప్రస్తుతం లక్షలాది మంది రైతులు పీఎం కిసాన్ యోజన 23వ విడత కోసం ఎదురుచూస్తున్నారు. అంతకుముందు పీఎం కిసాన్ యోజన 22వ విడతను మార్చి 13న విడుదల చేశారు. ఈ విడత ద్వారా, దేశవ్యాప్తంగా 93.2 మిలియన్లకు పైగా రైతుల ఖాతాలకు డీబీటీ పద్ధతిలో రూ.18,640 కోట్లకు పైగా మొత్తాన్ని నేరుగా బదిలీ చేశారు. మీ పేరు పీఎం కిసాన్ యోజన జాబితా నుండి తొలగించారేమోనని టెన్షన్ పడుతుంటే ఇలా చెక్ చేసుకోండి.

పీఎం కిసాన్ యోజన స్థితిని తనిఖీ చేయడానికి, మీరు ముందుగా అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ ని సందర్శించాలి.

హోమ్ పేజీకి కుడి వైపున, మీకు 'మీ స్టేటస్‌ని తెలుసుకోండి' అనే ఎంపిక కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయండి.

మీరు 'మీ స్థితిని తెలుసుకోండి'పై క్లిక్ చేయగానే, మీ ముందు ఒక కొత్త పేజీ తెరుచుకుంటుంది.

దీని తర్వాత మీరు మీ రిజిస్ట్రేషన్ నంబర్, క్యాప్చాను నమోదు చేసి, 'గెట్ యువర్ ఓటీపీ'పై క్లిక్ చేయాలి.

మీ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఞాని నమోదు చేసి, ముందుకు కొనసాగండి.

దీని తర్వాత మీ చెల్లింపు చరిత్ర, వాయిదాల స్థితి, వఖ్జ స్థితిని చూడటానికి మీరు 'గెట్ డేటా' పై క్లిక్ చేయాలి.

మీ వ-ఖ్జ సమాచారం ఇక్కడ అప్‌డేట్ చేయబడి, వాయిదాల డేటా అంతా కనిపిస్తుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 23వ వాయిదా కూడా మీ ఖాతాకు జమ చేయబడుతుంది.

### పీఎం కిసాన్ 23వ విడత ఎప్పుడు వస్తుంది?

పీఎం కిసాన్ యోజన 23వ విడత విడుదల తేదీని కేంద్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే 2024, 2025 సంవత్సరాల ట్రెండ్‌లను బట్టి చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరపు మొదటి విడత జూన్, జూలై నెలలో అందవచ్చు.


## ముంచుకొస్తున్న మందుల ముప్పు ఒకేసారి ఐదుకుపైగా మందులు వాడుతున్నారా? ఐతే జాగ్రత్త



మందులు రాసే ముందు పాత ప్రిస్క్రిప్షన్లను వైద్యులకు చూపించాలి. అవసరం లేని మందులను తగ్గించుకోవడమే ఉత్తమమని డాక్టర్ లు తెలుపుతున్నారు. ఇంకో విషయం ఏంటంటే ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల కారణంగా మందులు ధరలు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొన్ని మందుల ధరలు పెరిగాయి. దీంతో పేషెంట్లకు ఆర్థిక భారం తప్పడం లేదు.. వయసు పైబడిన వారు రోగాల బారిన పడటం సహజం.. కానీ ఆ రోగాల నుంచి ఉపశమనం కోసం వాడే మందులే ఇప్పుడు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వారిలో పాలీఫార్మసీ ఇబ్బంది పెడుతుంది.ఒకేసారి ఎక్కువ రకాల మందులు వాడటం పాలీఫార్మసీ అంటారు. ఇది ఈ మధ్య విపరీతంగా పెరుగుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మెడికల్ కాలేజీ పరిశోధక బృందం ఏడాది పాటు నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అధ్యయనంలో పాల్గొన్న వృద్ధుల్లో 64 శాతం మందికి డ్రగ్ రియాక్షన్ ముప్పు పొంచి ఉంది.ఎంత ఎక్కువ మెడిసిన్ వాడతారో ఈ ఎఫెక్ట్ అంత ఎక్కువగా ఉంటుంది.వృద్ధులు సగటున 7.4 రకాల మందులను వాడుతున్నారు. ఇందులో 24 శాతం మంది వృద్ధులు రోజుకు 10 కంటే ఎక్కువ మందులు వేసుకుంటున్నారు. మందుల మధ్య జరిగే రసాయనిక చర్యల వల్ల 17.6 శాతం మందిలో ఈ రియాక్షన్ అత్యంత ప్రమాదకరంగా ఉంది.కొన్ని రకాల మందులను కలిపి వాడటం వల్ల శరీరంలో విషతుల్యమైన మార్పులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు

1. ఆస్పిరిన్ ం క్లోపిడోగ్రెల్: గుండె సంబంధిత సమస్యల కోసం ఈ రెండూ కలిపి వాడితే రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. 2. ఇన్సులిన్ ం బీటా-బ్లాకర్స్: షుగర్ లెవల్స్ పడిపోయినప్పుడు వచ్చే హెచ్చరిక లక్షణాలను బీటా-బ్లాకర్స్ అణచివేస్తాయి. దీనివల్ల రోగి కోమాలోకి వెళ్లే ఛాన్స్ ఉంది. 3. ఇన్హిబిటర్లు ం పొటాషియం: వీటివల్ల రక్తంలో పొటాషియం స్థాయి పెరిగి నేరుగా గుండెపై ప్రభావం పడుతుంది. కళ్లు తిరగడం, తీవ్రమైన అలసట, జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి. లి శరీర సమతుల్యత దెబ్బతిని కిందపడిపోయే ప్రమాదం ఉంది. లి ఒక మందు వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్‌ను మరో వ్యాధిగా భ్రమపడి, మరిన్ని కొత్త మందులు వాడటం వల్ల రోగిపై ఆర్థిక భారం కూడా పెరుగుతుంది. మందులు రాసే ముందు పాత ప్రిస్క్రిప్షన్లను వైద్యులకు చూపించాలి. అవసరం లేని మందులను తగ్గించుకోవడమే ఉత్తమమని డాక్టర్ లు తెలుపుతున్నారు. ఇంకో విషయం ఏంటంటే ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల కారణంగా మందులు ధరలు కూడా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే కొన్ని మందుల ధరలు పెరిగాయి. దీంతో పేషెంట్లకు ఆర్థిక భారం తప్పడం లేదు.

## పొరపాటున వేరే నంబర్‌కు రీఛార్జ్ చేశారా? జియో యూజర్లు తమ డబ్బును తిరిగి పొందే సింపుల్ ప్రాసెస్ ఇదే!




ఎవరైనా పొరపాటున రీఛార్జ్ చేసుకుంటే మూడు గంటల్లోగా రీఫండ్ రిక్వెస్ట్ పంపాలని రిలయన్స్ జియో తెలిపింది. ఆ తర్వాత ఆ రిక్వెస్ట్‌ను అంగీకరించబోమని పేర్కొంది. రిలయన్స్ జియో ఆ రిక్వెస్ట్‌ను పరిశీలించి కొన్ని గంటల్లోనే డబ్బును రీఫండ్ చేస్తుంది. మొబైల్ రీఛార్జ్ రోజురోజుకీ ఖరీదైనదిగా మారుతోంది. గతంలో 10 లేదా 20 రూపాయలతో రీఛార్జ్ చేసుకునే వీలుండేది. కానీ ఇప్పుడు కనీసం 199 రూపాయలు రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తోంది. ఒకవేళ ఎవరైనా పొరపాటున వేరే నంబర్‌కు రీఛార్జ్ చేస్తే, అది పెద్ద నష్టమే! ఆ రీఛార్జ్‌తో పాటు పెట్టిన డబ్బు కూడా వృధా అవుతుంది. కానీ జియో తన వినియోగదారులను ఈ సమస్య నుండి విముక్తి చేయబోతోంది. ఇప్పుడు మీరు పొరపాటున రీఛార్జ్ చేస్తే, ఆ డబ్బు మీకు వాపసు వస్తుంది. అది ఎలాగో తెలుసా? మీరు తొందరలో పొరపాటున రీఛార్జ్ చేసి ఉంటే ఇప్పుడు మీరు రీఫండ్ సౌకర్యాన్ని పొందవచ్చు. ఈ సౌకర్యం రిలయన్స్ జియో కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. కస్టమర్లు రీఛార్జ్ చేసిన తర్వాత పరిమిత సమయంలోగా వీఎజీఅశీ యాప్‌లో రీఫండ్ రిక్వెస్ట్ పంపితే, వెరిఫికేషన్ తర్వాత కొన్ని గంటల్లోనే ఆ రీఛార్జ్ డబ్బును రీఫండ్ పొందవచ్చు. పొరపాటున అలాంటి రీఛార్జ్ జరిగినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కంపెనీ తెలియజేసింది. వీఎజీఅశీ యాప్ ద్వారా రీఫండ్ పొందవచ్చు. అయితే మీరు వీఎజీఅశీ యాప్ లేదా అధికారిక ఛానెళ్ల ద్వారా రీఛార్జ్ చేస్తే మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మీరు ౖఖఽఎ లేదా ౖష్ట్రశీఅవూవ యాప్ వంటి థర్డ్ పార్టీ యాప్‌ల నుండి రీఛార్జ్ చేస్తే, మీరు ఈ రీఫండ్ అవకాశాన్ని పొందలేరు.

### రీఫండ్ ఎలా పొందాలి?

మీరు పొరపాటున వేరే నంబర్‌కు రీఛార్జ్ చేస్తే, అప్పుడు

ముందుగా మీరు వీఎజీఅశీ యాప్‌ను తెరిచి మీ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి.

ఆ తర్వాత ట్రాన్సాక్షన్ హిస్టరీ విభాగానికి వెళ్లి తప్పుగా జరిగిన రీఛార్జ్‌ను ఎంచుకోండి.

ఇక్కడ మీకు 'ప్లాన్‌ను రద్దు చేయి' అనే ఎంపిక కనిపిస్తుంది. అయితే, ఇది పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

ఇప్పుడు తదుపరి దశలో మీరు రీఛార్జ్ రద్దుకు గల కారణాన్ని తెలియజేయాలి. ఆ తర్వాత మీరు వాపసు అభ్యర్థనను పంపాలి.

ఎవరైనా పొరపాటున రీఛార్జ్ చేసుకుంటే మూడు గంటల్లోగా రీఫండ్ రిక్వెస్ట్ పంపాలని రిలయన్స్ జియో తెలిపింది. ఆ తర్వాత ఆ రిక్వెస్ట్‌ను అంగీకరించబోమని పేర్కొంది. రిలయన్స్ జియో ఆ రిక్వెస్ట్‌ను పరిశీలించి కొన్ని గంటల్లోనే డబ్బును రీఫండ్ చేస్తుంది.

## పీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్ ఇక నుంచి ఏటీఎం, యూపీఐ ద్వారా పీఎఫ్ నిధులు విత్ డ్రా..!

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO) తన కోట్లాది మంది చందాదారుల కోసం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోంది. మే నెలాఖరు నాటికి, పీఎఫ్ ఖాతాదారులు తమ నిధులను ఏటీఎం, యూపీఐ ద్వారా విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. సుమారు 7.8 కోట్ల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే ఈ నిర్ణయం, పీఎఫ్ ఉపసంహరణ ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని మరియు కాగితపు పనిని పూర్తిగా తొలగించనుంది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO) తన కోట్లాది మంది చందాదారుల కోసం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోంది. మే నెలాఖరు నాటికి, పీఎఫ్ ఖాతాదారులు తమ నిధులను ఏటీఎం యూపీఐ ద్వారా విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. సుమారు 7.8 కోట్ల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే ఈ నిర్ణయం, పీఎఫ్ ఉపసంహరణ ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని మరియు కాగితపు పనిని పూర్తిగా తొలగించనుంది.




### ఏమిటీ జ్యూఖీూ 3.0 ప్రాజెక్ట్?

ప్రావిడెంట్ ఫండ్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడం, వేగవంతం చేయడం, పారదర్శకతను పెంచడం లక్ష్యంగా 'జ్యూఖీూ 3.0' ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం చేపట్టింది. ఈ వ్యవస్థ 2026 మధ్య నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. దీనివల్ల క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బు రావడానికి 10 నుండి 20 రోజులు పడుతోంది. కొత్త విధానంలో ఇది కేవలం 2 నుండి 5 రోజులకు తగ్గుతుంది. రూ. 5 లక్షల వరకు ఉన్న క్లెయిమ్‌లు ఎటువంటి మానవ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేయడం జరుగుతుంది. ఇకపై ఆధార్ ధృవీకరించిన ఖాతాలకు పాస్‌బుక్ లేదా చెక్కుల ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు.

### నగదు ఉపసంహరణ ఎలా?

కొత్త విధానం ప్రకారం, సభ్యులకు వారి పీఎఫ్ ఖాతాతో అనుసంధానించిన ఒక ప్రత్యేక ఏటీఎం కార్డు జారీ చేయడం జరుగుతుంది.

1. ATM ఉపసంహరణ: ఈ కార్డు ద్వారా నేరుగా ఏటీఎం మెషీన్ల నుండి నగదు తీసుకోవచ్చు.

2. UPI బదిలీ: గూగుల్ పే, ఫోన్ పే వంటి యాప్‌ల ద్వారా పీఎఫ్ నిధులను నేరుగా బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు.

3. పరిమితి: ప్రాథమిక దశలో గరిష్టంగా రూ. 1 లక్ష వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని అంచనా.

### ఉద్యోగం మారినప్పుడు ఆటోమేటిక్ బదిలీ

చాలామంది ఉద్యోగం మారినప్పుడు పాత కంపెనీ నుండి కొత్త కంపెనీకి పీఎఫ్ బదిలీ చేసుకోవడానికి ఇబ్బందులు పడేవారు. జ్యూఖీూ 3.0 ద్వారా, ఉద్యోగి మారిన వెంటనే పీఎఫ్ బ్యాలెన్స్ ఆటోమేటిక్‌గా కొత్త యజమానికి బదిలీ అవుతుంది. దీనివల్ల పాత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

### అర్హతలు నిబంధనలు

ఈ సదుపాయాన్ని పొందాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి:

### సభ్యుని ఖూచీయాక్టివ్‌గా ఉండాలి.

ఖాతాకు ఆధార్, పాన్ బ్యాంక్ ఖాతా అనుసంధానమై ఉండాలి.

ఉద్యోగం కోల్పోయిన వారు నెల రోజుల తర్వాత 75% నిధులను, రెండు నెలల తర్వాత మిగిలిన 25% నిధులను విత్‌డ్రా చేసుకోవచ్చు.

పీఎఫ్ అనేది పదవీ విరమణ కాలం నాటి ప్రధాన పొదుపు అని నిపుణులు గుర్తు చేస్తున్నారు. దీనిపై వచ్చే చక్రవడ్డీ భవిష్యత్తులో పెద్ద మొత్తాన్ని అందిస్తుంది. కాబట్టి, అత్యవసరమైతేనే డబ్బు తీయడం ఉత్తమం. వరుసగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన తర్వాత పీఎఫ్ విత్‌డ్రా చేస్తే దానిపై ఎటువంటి ఆదాయపు పన్ను ఉండదు. ఈ సరికొత్త మార్పులతో సామాన్య ఉద్యోగులకు తమ సొంత డబ్బుపై పూర్తి నియంత్రణ లభించనుంది.

## రత్నాల గనిలో దొరికిన అపురూప నిధి 11,000 క్యారెట్ల భారీ కెంపు దీని విలువ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే!




రత్నాల గనిగా పేరుగాంచిన మయన్మార్‌లో మరోసారి అద్భుతమైన నిధి వెలుగుచూసింది. ఈ ఆగ్నేయాసియా దేశంలో ఇప్పటివరకు లభించిన రత్నాలన్నింటిలోకీ అతిపెద్దదైన ఒక భారీ కెంపు లభ్యమైంది. దీని బరువు వింటే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. ఏకంగా 11,000 క్యారెట్ల బరువున్న ఈ కెంపు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మయన్మార్‌లో ఒక అద్భుతం జరిగింది. మయన్మార్‌లోని రత్నాల నిక్షేపాలకు ప్రసిద్ధి చెందిన ఒక ప్రాంతంలో గని తవ్వకాలు జరుపుతుండగా ఈ భారీ రత్నం బయటపడింది. ప్రపంచ రత్నాల చరిత్రలోనే ఇది ఒక అరుదైన, అతిపెద్ద ఆవిష్కరణగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ కెంపు పరిమాణం, నాణ్యత చూసి గని కార్మికులతో పాటు అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. సాధారణంగా కెంపులు చాలా చిన్న పరిమాణంలో లభిస్తాయి. కానీ, ఇంత భారీ పరిమాణంలో, నాణ్యమైన ఎరుపు రంగులో ఉన్న కెంపు దొరకడం అనేది ఖగోళ వింత కంటే తక్కువేమీ కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ రత్నం పొడవు, వెడల్పు కూడా చాలా ఎక్కువగా ఉండటం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో కెంపులకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. నాణ్యతను బట్టి ఒక్కో క్యారెట్ ధర వేల నుండి లక్షల రూపాయల వరకు ఉంటుంది. అటువంటిది 11,000 క్యారెట్ల బరువున్న ఈ కెంపు విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని ప్రాథమిక అంచనా. దీనిని పాలిష్ చేసి, ముక్కలుగా చేస్తే దాని విలువ ఇంకా పెరిగే అవకాశం ఉంది. అయితే, ఇది ఒకే శిలగా ఉండటం వల్ల దీనికి చారిత్రక ప్రాధాన్యత కూడా తోడైంది. ప్రపంచవ్యాప్తంగా లభించే అత్యుత్తమ నాణ్యత గల కెంపులలో 90 శాతం మయన్మార్ నుండే వస్తాయి. వీటిని మొగోక్ రూబీస్ అని పిలుస్తారు. వీటికున్న ముదురు ఎరుపు రంగుప్రపంచంలో మరెక్కడా దొరకదు. ఇప్పుడు దొరికిన ఈ భారీ కెంపు కూడా అదే కోవకు చెందినది కావడంతో దీనికి గిరాకీ విపరీతంగా పెరిగింది.

పెడల్ ఎక్సర్‌సైజర్ ఏం వాకింగ్ ప్యాడ్! హోమ్ వర్కౌట్‌కు ఏది బెస్ట్

ప్రస్తుతం ఈ అరుదైన నిధిని మయన్మార్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య భద్రపరిచింది. దీనిని అంతర్జాతీయ వేలంలో ఉంచుతారా లేక దేశ గర్వకారణంగా మ్యూజియంలో ప్రదర్శనకు పెడతారా అనేది ఇంకా నిర్ణయించలేదు. రత్నాల ప్రేమికులు, వ్యాపారులు ఈ భారీ కెంపు గురించి మరిన్ని వివరాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రైల్వేస్టేషన్‌లో ఓ ట్రైన్‌కు ప్లాట్‌ఫామ్ ఎలా నిర్ణయిస్తారో తెల్సా



రైల్వే స్టేషన్‌లో ఏ ట్రైన్ ఏ ప్లాట్‌ఫామ్‌కు రావాలో ఎవరు నిర్ణయిస్తారు? కేవలం ఒక షెడ్యూల్ మాత్రమే ఉంటుందా లేక మరేదైనా కారణాలు ఉంటాయా? వందే భారత్, రాజధాని వంటి రైళ్లకు ఎందుకు ఎప్పుడూ ఒకటో ప్లాట్‌ఫామ్ ఇస్తారు? విజయవాడ, సికింద్రాబాద్ లాంటి పెద్ద జంక్షన్‌లలో ప్లాట్‌ఫామ్ కేటాయింపు వెనుక ఉన్న అసలు రహస్యాలు ఈ కథనంలో.. రైలు ప్రయాణంలో ప్లాట్‌ఫామ్ నంబర్ తెలుసుకోవడం ప్రయాణికులకు చాలా ముఖ్యం. ప్రతి స్టేషన్‌లో దీని కోసం ఒక ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. దానిని 'స్టాండింగ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' అని పిలుస్తారు. అంటే ఏ రైలు ఏ సమయానికి రావాలి, ఏ ప్లాట్‌ఫామ్‌పై ఆగాలి అనే షెడ్యూల్ ముందే ఉంటుంది. అయితే, కొన్నిసార్లు రైళ్లు ఆలస్యమైనప్పుడు ఈ కేటాయింపుల్లో మార్పులు జరుగుతుంటాయి. ప్లాట్‌ఫామ్ కేటాయింపును ప్రభావితం చేసే ప్రధాన అంశాలు ఇవే:

1. రైలు ప్రాధాన్యత:

వందే భారత్, రాజధాని, శతాబ్ది లాంటి ప్రీమియం రైళ్లకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రయాణికులకు స్టేషన్ నుండి సులభంగా బయటకు వెళ్లే వీలు కల్పించడానికి వీటికి గరిష్టంగా ప్లాట్‌ఫామ్ నంబర్ 1 కేటాయిస్తారు. మెయిన్ ఎంట్రన్స్ కు దగ్గరగా ఉండటం వల్ల ప్రయాణికులు సులభంగా లోపలికి రావడానికి, బయటకు వెళ్లడానికి వీలుంటుంది.

2. ప్రయాణ దిశ:

రైలు ఏ వైపు నుండి వస్తోంది, ఏ వైపు వెళ్తోంది అనేది చాలా ముఖ్యం. ఎక్కువ ట్రాక్‌లు మారకుండా నేరుగా మెయిన్ లైన్‌లోకి వెళ్లిపోయేలా ప్లాట్‌ఫామ్‌ను ఎంపిక చేస్తారు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా ఇతర రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగదు.

3. రైలు పొడవు:

అన్ని ప్లాట్‌ఫామ్‌ల పొడవు ఒకేలా ఉండదు. 24 కోచ్‌లు ఉండే ఎక్స్‌ప్రెస్ రైలుకు పొడవైన ప్లాట్‌ఫామ్ కావాలి, అదే మెము లేదా ప్యాసింజర్ రైళ్లకు చిన్న ప్లాట్‌ఫామ్ సరిపోతుంది. అలాగే గూడ్స్ రైళ్లకు వాటి పొడవును బట్టి ప్రత్యేకమైన లూప్ లైన్లు లేదా ప్లాట్‌ఫామ్‌లను కేటాయిస్తారు. ఈ ఆపరేషన్లన్నీ స్టేషన్ మాస్టర్, సెక్షన్ కంట్రోలర్ పర్యవేక్షణలో జరుగుతాయి. వీటితో పాటు ఇంటర్లాకింగ్ సిస్టమ్, ఆటోమేటిక్ సిగ్నలింగ్ లాంటి సాంకేతిక అంశాలు కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. మన రైల్వే వ్యవస్థ ఎంత పకడ్బందీగా పనిచేస్తుందో చెప్పడానికి ఈ మేనేజ్‌మెంట్ ఒక గొప్ప ఉదాహరణ.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com